

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 10-04-2025 | సంపుటి - 22 | సంచిక - 346 | రూ : 4 | పేజీలు: 8


## గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాల్సిందే!

- పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్: పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురికి బుధవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ‘‘ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,100 దాటడం నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలకు మోయలేని భారంగా మారింది. ఎల్పీజీ ధరలు పొరుగు దేశాల్లో కంటే భారత్‌లోనే ఎక్కువగా ఉన్నాయి. వెంటనే పెంచిన ఈ ధరలను తగ్గించాల్సిందే. మరోవైపు తరువాయి 2లో





## బ్రిటిషర్ల కంటే భాజపా ప్రమాదకరం

- రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆ పార్టీని ఓడించాలి
- ఏఐసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ‘‘బ్రిటిషర్ల కంటే భాజపా ప్రమాదకరం. ఆంగ్లేయులను దేశం నుంచి వెళ్లగొట్టినట్లే రాహుల్‌గాంధీ నాయకత్వంలో భాజపాను ఓడించాలి’’ అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపాను ఖతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ‘అఖిల భారత కాంగ్రెస్ కమిటీ’ (ఏఐసీసీ) సమావేశంలో బుధవారం తరువాయి 2లో

## గ్రూప్1 మెరిట్ జాబితా వెల్లడి

- 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నాంపల్లిలో ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ప్రక్రియ

హైదరాబాద్: రాష్ట్రంలో 563 గ్రూప్1 సర్వీసుల ఉద్యోగాల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన కోసం టీజీపీఎస్సీ 1:1 నిష్పత్తిలో మెరిట్ జాబితాను ప్రకటించింది. గ్రూప్1లో ఇంటర్వ్యూలు లేకపోవడంతో 1:2కి బదులుగా నేరుగా 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచింది. ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో తరువాయి 2లో

TELANGANA PUBLIC SERVICE COMMISSION

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్




## పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

- సెప్టెంబరు 30లోగా బిగించుకోవాల్సిందే
- లేదంటే బీమా సహా అన్ని సేవలూ బంద్
- కేసులూ నమోదు చేస్తారు

హైదరాబాద్: పాత వాహనాన్ని ఉపయోగిస్తున్నారా? అది 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైందా? అయితే.. దానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) బిగించుకోవాల్సిందే. ద్విచక్ర వాహనం నుంచి నాలుగు చక్రాల బండ్ల వరకు ఏవైనా సరే ఇకపై ఈ నంబర్ ప్లేట్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాల్సిందే. దీనికి రవాణాశాఖ సెప్టెంబరు 30వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్‌కు కనిష్ఠంగా రూ.320.. గరిష్ఠంగా రూ.800గా తరువాయి 2లో

## తగ్గనున్న ఈఎంఐల భారం

- ఇల్లు, వాహన రుణాలపై ఈ ఏడాదిలో తగ్గిన అర శాతం వడ్డీ



ఇల్లు, వాహనం కొనుగోలుకు రుణం తీసుకోవాలనుకుంటున్న, ఇప్పటికే తీసుకున్న వారికి ఊరట కలిగించే నిర్ణయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25% నుంచి 6 శాతానికి పరిమితం చేసింది. ఫిబ్రవరిలోనూ రెపోరేటును 0.25% తగ్గించినందున.. 2025లోనే ఇది రెండో రేటు తగ్గింపు. వ్యక్తిగత రుణాలపైనా నెలవారీ తరువాయి 2లో

## విద్యార్థుల్లో ‘ఓపీటీ’ కల్లోలం!

### మూడేళ్ల అనుమతి రద్దుకు బిల్లు తేనున్న అమెరికా?

- కాంగ్రెస్ ఆమోదిస్తే 3 లక్షల మంది భారతీయులు వెనక్కి..
- హెచ్1బీ వీసాలపైనా ఉక్కుపాదం
- దేశం వీడి వెళ్లొద్దంటూ ప్రముఖ కంపెనీల హెచ్చరిక
- గ్రీన్ కార్డుదారులకూ కంటిమీద కునుకు లేదు

సుంకాలతో ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వలస విధానాలతో విదేశీయుల్లో కల్లోలం రేపుతున్నారు. చదువు పూర్తయిన అనంతరం అమెరికాలో మూడేళ్లపాటు ఉండి ఉద్యోగాలను వెతుక్కునేందుకు, పని చేసుకునేందుకు ఇచ్చే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) అనుమతిని రద్దు చేసేందుకు బిల్లు తేవాలని యోచిస్తున్నారు. ఇది విద్యార్థుల్లో కలవరం సృష్టిస్తోంది. ఇక ఉద్యోగం సాధించి హెచ్1బీ వీసాల మీద తరువాయి 2లో



## పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి

- అధికారులకు సీఎం చంద్రబాబు సూచన
- ఆదాయార్జన శాఖలపై సమగ్ర సమీక్ష

2లో





## 90 రోజుల ఊరట

- సుంకాలపై ట్రంప్ అనూహ్య నిర్ణయం
- అప్పటిదాకా అన్ని దేశాలపై 10%
- చైనాతో మాత్రం ఢీ అంటే ఢీ
- 125 శాతానికి పెంపు
- 84 శాతంతో డ్రాగన్ ప్రతీకారం

2లో

## అమరావతిలో సొంతింటికి సీఎం శంకుస్థాపన

- కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తరలివచ్చిన అమరావతి రైతులు

2లో



# పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

(మొదటిపేజీ తరువాయి)

ఛార్జీలను ఖరారు చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, దొంగతనాలను అరికట్టడం, వాహనాలు రహదారి భద్రత లక్ష్యంగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి తయారైన వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ నంబర్ ప్లేట్ నిబంధన ఇప్పటికే అమలవుతోంది. ఇప్పుడు పాత వాహనాలకూ దీన్ని తప్పనిసరి చేశారు.

*** వాహన యజమానిదే బాధ్యత**

పాత వాహనాలకు కొత్తనంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత వాహన యజమానిదే అని రవాణాశాఖ తెలిపింది. అది లేని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా రవాణా కార్యాలయంలో పేరు మార్చుకోవడం సాధ్యం కాదు.

వాహన బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా జారీ చేయరు. గడువు తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తారు.

వాహన తయారీ సంస్థలు తమ డీలర్ల వద్ద హెచ్ఎస్ఆర్పీ బిగించే సదుపాయాన్ని కల్పించాలి. ఈ సమాచారం, నంబర్ ప్లేట్ ధరలు డీలర్ల దగ్గర కనిపించేలా ప్రదర్శించాలి. వాహనదారు ఇంటికే వెళ్లి నంబర్ ప్లేట్ బిగిస్తే అదనంగా రుసుం తీసుకోవచ్చు.

వాహనదారులు ఈ ప్లేట్ కోసం www.siam.in వెబ్సైట్లో ..వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాలి. కొత్త ప్లేట్ బిగించాక ఆ ఫొటోను వెబ్సైట్లో అప్లోడ్ చేయాలి.



## బ్రిటిషర్ల కంటే భాజపా ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. ''మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలి. మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ గడ్డపైన, సబర్మతీ నది ఒడ్డున రెండు రోజులుగా కాంగ్రెస్ మేధోమథన సదస్సు నిర్వహిస్తోంది. మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతి ఒడ్డున సమావేశమయ్యాం.

**రాహుల్ హామీలను అమలు చేశాం**

రైతులకు వ్యతిరేకంగా మోదీ నల్ల చట్టాలు తెచ్చారు. వాటిని నిరసిస్తూ.. రైతులు 15 నెలలపాటు ధర్నాలు చేసినా కేంద్రప్రభుత్వం చర్చలకు రాలేదు. మోదీ మణిపూర్లో మంటలు రాజేశారు. దేశ మూలవాసుల జీవన హక్కులను కాలరాసే ప్రయత్నం చేశారు. మరోవైపు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. కులగణన, రైతు రుణమాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు.. కులగణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్గాంధీ హామీలు ఇచ్చారు. వాటి ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. రాష్ట్రంలో కులగణన చేసి చూపించాం. కులగణనపై రాహుల్గాంధీ మాట్లాడతారనే భయంతోనే ఆయనకు లోక్సభలో మైక్ ఇవ్వలేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ హామీ ఇచ్చి 11 సంవత్సరాలు దాటిపోయింది. ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలివ్వాలి. మోదీ, అమిత్ షాలకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ప్రతి ఏటా 2 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు రాలేదు. గాంధీజీ 30 ఏళ్లపాటు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు అనేక పోరాటాలు చేశారు. కానీ బ్రిటిష్ వాళ్లు ఎప్పుడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాంధీజీపై గాడ్సే తూటా పేల్చి హత్య చేశారు. గాంధీ ఆలోచనధారతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలి. దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్గాంధీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా. రైతులు, యువత, మహిళల కోసం ఈ సమావేశాల్లో సాగిన చర్చలపై ఆశతో నేను ఇక్కడి నుంచి వెళుతున్నా.

**పటేల్తో తెలంగాణకు అనుబంధం**

మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభ్భాయ్ పటేల్ నేతృత్వంలో తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభ్భాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది. అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని మాకు సోనియా గాంధీ అందించారు. వల్లభ్భాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా... సోనియా గాంధీ నాయకత్వంలో మేం భాజపాను తెలంగాణలో అడుగు పెట్టనివ్వం. ఆ పార్టీని ఎవరూ క్షమించరు. తెలంగాణలో భాజపాను అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకెళ్తున్నాం. రానున్న రోజుల్లో ఆ పార్టీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు స్వీకరించాలని నా విజ్ఞప్తి'' అని రేవంత్రెడ్డి అన్నారు.

**హైదరాబాద్కు తిరిగి వచ్చిన సీఎం**

అహ్మదాబాద్లో రెండు రోజులపాటు జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్న సీఎం రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, తెలంగాణకు చెందిన ఇతర ముఖ్యనేతలంతా బుధవారం రాత్రి అహ్మదాబాద్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకున్నారు. మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, ఏఐసీసీ సభ్యులు, సీడబ్ల్యూసీ సభ్యులు సహా తెలంగాణ నుంచి మొత్తం 41 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి దివంగతులైన డి.శ్రీనివాస్తో పాటు ఇతర నాయకులు నర్సారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, టి.నాగయ్యలకు సదస్సులో నివాళులు అర్పించారు.

## తగ్గనున్న ఈఎంఐల భారం

(మొదటిపేజీ తరువాయి)

కిస్తీ (ఈఎంఐ) భారం తగ్గుతుంది. ఆర్బీఐ రెపో రేటును తగ్గిస్తే.. రెపో ఆధారిత వడ్డీ రేటుకు రుణం తీసుకున్న గృహరుణ గ్రహీతలకు ఆ మేర ఉపశమనం కలుగుతుంది. అత్యధిక బ్యాంకులు రెపో రేటుపై 2.65% వరకు, మరికొన్ని 2.75% వరకు అదనంగా వడ్డీ వసూలు చేస్తాయి. దీన్ని బట్టి చూస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్స్టర్నల్ బెంచ్మార్క్ వడ్డీ రేటు (ఈబీఆర్) 8.65 శాతానికి చేరే అవకాశం ఉంది. వడ్డీరేట్లు తక్కువగా ఉన్నప్పుడు గృహరుణాలు తీసుకున్నవారు, కొంతకాలంగా అధిక వడ్డీ భారం మోస్తున్నారు. ముందు అనుకున్న వ్యవధికి మించి, అయిదారేళ్లకు పైగా నెలవారీ కిస్తీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రెండు నెలల వ్యవధిలోనే 0.50% మేర వడ్డీ రేటులో కోత పడటంతో, వారికి భారం తగ్గనుంది.

**ఇప్పుడే కాకపోవచ్చు**

ఆర్బీఐ రెపో రేటును తగ్గించినా.. అన్ని బ్యాంకులూ గృహరుణ వడ్డీ రేటును తగ్గిస్తాయని చెప్పలేం. కొన్నిసార్లు నిధుల సమీకరణ ఖర్చులు పెరగడం, నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి.. వంటి కారణాల వల్ల ఆర్బీఐ ప్రయోజనాన్ని, తమ ఖాతాదార్లకు బదిలీ చేయడంలో బ్యాంకులు ఆలస్యం చేయొచ్చు. ఫిబ్రవరి నాటి రేటు తగ్గింపు ప్రయోజనాన్ని కొన్ని బ్యాంకులు ఇప్పటికీ రుణగ్రహీతలకు వర్తింపచేయలేదు కూడా. అందువల్ల రుణం తీసుకున్న బ్యాంకును సంప్రదించి, వడ్డీ తగ్గించారా లేదా అన్నది ఖాతాదారులు సరిచూసుకోవడం ఉత్తమం.

**క్రెడిట్ స్కోరు తక్కువుంటే..**

క్రెడిట్ స్కోరు 750కి మించి ఉన్న వారికే బ్యాంకులు తక్కువ వడ్డీ రేటును వర్తింప చేస్తాయి. ఒకవేళ క్రెడిట్ స్కోరు పేలవంగా ఉంటే... గృహరుణాల వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనం పొందలేరు. అందువల్ల భవిష్యత్తులో ఏదైనా ఒక బ్యాంకు 7.85 శాతానికి గృహ రుణాన్ని అందించినా, ఇది అందరికీ వర్తించకపోవచ్చు.

**అర శాతం తగ్గితే..**

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రుణాలపై 0.50% (రెండు సార్లు 0.25% చొప్పున) వడ్డీ తగ్గింది. దీంతో గృహరుణ లెక్కలు మారనున్నాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.40 లక్షల గృహ రుణాన్ని 8.75% వడ్డీపై ఇరవై సంవత్సరాల వ్యవధికి తీసుకున్నారనుకుందాం. అప్పుడు నెలవారీ వాయిదా (ఈఎంఐ) రూ. 35,348 అవుతుంది. వడ్డీ అర శాతం తగ్గి 8.25 శాతానికి చేరితే, ఈఐఎం రూ.34,083కు చేరుతుంది. అంటే.. వడ్డీ రూపంలో రుణవ్యవధి తీరే నాటికి రూ.3,09,793 ఆదా అవుతుంది. సాధారణంగా బ్యాంకులు ఈఎంఐ మొత్తాన్ని తగ్గించవు. కాలవ్యవధినే సర్దుబాటు చేస్తాయి. 8.75% వడ్డీ ఉన్నప్పుడు (ఈఎంఐ రూ.35,348) 240 నెలల పాటు వాయిదాలు చెల్లించాల్సి వస్తే... 8.25 శాతానికి వడ్డీ చేరినప్పుడు అదే ఈఎంఐ కొనసాగిస్తే... 220 నెలల్లోనే రుణం పూర్తవుతుంది. ఒకసారి మీ బ్యాంకును సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోవాలి. కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారికి, వాయిదా భారం కొంత తగ్గుతుంది. అప్పుడు రుణ అర్హత సైతం పెరగొచ్చు.

**ఎఫ్డీలపైనా ప్రభావం**

గత ఏడాది వరకు బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్లపై కాస్త అధిక వడ్డీ రేట్లు లభించాయి. వడ్డీ రేట్లు తగ్గుతున్న క్రమంలో బ్యాంకులు ఫిక్స్డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లలోనూ సర్దుబాటు చేస్తున్నాయి. బ్యాంకులు ప్రత్యేక పథకాలనూ నిలిపి వేస్తున్నాయి. కాబట్టి, ఫిక్స్డ్ డిపాజిట్ చేసేవారు అధిక వడ్డీనిచ్చే బ్యాంకులను పరిశీలించాలి.

**8 శాతానికి దిగిరావచ్చు**

ఈ ఏడాదిలో అర శాతం మేరకు వడ్డీని ఆర్బీఐ తగ్గించిన నేపథ్యంలో, గృహరుణ వడ్డీ రేటు కనిష్ఠంగా 8 శాతానికి దిగిరావచ్చు. ప్రస్తుతం ఎస్బీఐ గృహరుణాలపై 8.25 9.20% వడ్డీ విధిస్తోంది. ఆర్బీఐ తాజా చర్య వల్ల ఈ వడ్డీ రేటు 8.008.95 శాతానికి పరిమితం కావచ్చు.

## 90 రోజుల ఊరట

న్యూయార్క్: ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. అనేక దేశాలపై అమలు కావాల్సిన సుంకాలను 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఉన్న 10శాతమే అప్పటిదాకా అమలు చేయాలని నిర్ణయించారు. అయితే చైనాతో మాత్రం కయ్యానికి మరింత కాలుదువ్వారు. ఆ దేశంపై ఏకంగా 125 శాతం సుంకాలతో విరుచుకుపడ్డారు. ప్రతీకారంగా చైనా.. అంతే దీటుగా స్పందించింది. అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించింది. ఇటు కెనడా, ఐరోపా దేశాలూ తగ్గేదే లేదంటూ ప్రతీకార సుంకాలతో విరుచుకుపడ్డాయి. పలు దేశాలు తమను సంప్రదించడంతో 90 రోజుల నిలిపివేత నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. అయితే ప్రపంచ మార్కెట్లు కుప్పకూలుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ నిర్ణయం వెలువడిన వెంటనే అమెరికా మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి.

**చైనాపై కసికొద్దీ..**

తొలుత చైనాపై 20 శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఆ తర్వాత దానికి అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన ప్రకటించారు. దీంతో అది 54శాతానికి చేరింది.

## గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

పెట్రో రేట్లను సెస్ల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోంది. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా... సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుండటం సరికాదు. కేంద్ర ప్రభుత్వ తీరును మార్చుకోవాల్సిందే'' అని తన లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు.

## విద్యార్థుల్లో 'ఓపీటీ' కల్లోలం!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నవారూ ప్రశాంతంగా లేకుండా వీసా విధానాలను కఠినతరం చేశారు. మరోవైపు గ్రీన్కార్డులున్న వారినీ విమానాశ్రయాల్లో గంటల తరబడి తనిఖీ చేయడంద్వారా భయపెడుతున్నారు.

**లక్షల మందిలో అనిశ్చితి!**

ఓపీటీని రద్దు చేసేలా అమెరికా కాంగ్రెస్లో ప్రవేశపెట్టాలనుకుంటున్న బిల్లువల్ల దాదాపు 3 లక్షల మంది భారతీయ విద్యార్థులు కష్టాలను ఎదుర్కోనున్నారు. ఆ బిల్లును సభలో పెట్టి ఆమోదిస్తే.. వారంతా భారత్కు తిరిగి రావాల్సి ఉంటుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ రంగాల్లో (స్టెమ్) అంతర్జాతీయ విద్యార్థులు.. ఓపీటీ అనుమతి పొందడానికి అవకాశముంటుంది. దీనిద్వారా వారు చదువు పూర్తయ్యాక మూడేళ్లపాటు అమెరికాలో ఉండి అనుభవం గడిస్తారు. ఉద్యోగాలను సాధిస్తారు. ఈ ఓపీటీవల్ల భారతీయ విద్యార్థులే అధికంగా లబ్ధి పొందుతుంటారు. 202324లో 97,556 మంది భారతీయులు ఓపీటీ అనుమతి తీసుకున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 41శాతం అధికం. ఓపీటీ రద్దు బిల్లుతో చదువు పూర్తయిన వెంటనే విద్యార్థులంతా అమెరికాను వీడాల్సి ఉంటుంది. దీనివల్ల వారి కెరీర్ దెబ్బతినడంతోపాటు ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయి. చాలా మంది విద్యార్థులు ఓపీటీ కాలంలోనే తమ విద్యా రుణాలను తీర్చుకుంటూ ఉంటారు. బిల్లు ఆమోదం పొందితే.. భారతీయ విద్యార్థుల ఉద్యోగావకాశాలకు గండి పడుతుంది. వారంతా ఉద్యోగావకాశాలు లభించే దేశాలకు వలస వెళ్లాల్సి ఉంటుంది. కెనడా, ఐరోపా దేశాల్లో అవకాశాలుంటే అక్కడికి వెళ్తారు. బిల్లు ప్రభావం తమపైనా పడుతుందని అమెరికా విశ్వవిద్యాలయాలు ఆందోళన చెందుతున్నాయి. విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గవచ్చని భయపడుతున్నాయి.

## గ్రూప్1 మెరిట్ జాబితా వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం (పూర్వ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం) పాత క్యాంపస్లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనుంది. ఈ ప్రక్రియకు ఈ నెల 22వ తేదీని రిజర్వు డేగా ప్రకటించింది. గడువు ప్రకారం నిర్ణీత తేదీల్లో హాజరుకాకున్నా, ఎవరివైనా ఒరిజినల్ సర్టిఫికెట్లు పెండింగ్లో ఉన్నా... అలాంటి వారి కోసం పరిశీలన కేంద్రం 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పనిచేస్తుంది. మెరిట్ జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికొలస్ స్పష్టంచేశారు. ప్రధాన పరీక్షల్లో చూపిన ప్రతిభ, రిజర్వేషన్లు, మల్టీజోన్ల వారీగా పోస్టులను పరిగణనలోకి తీసుకుని 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశామని, ఈ జాబితాను వెబ్సైట్లో పొందుపరచినట్లు తెలిపారు. ''అభ్యర్థులు ఈ నెల 10 నుంచి పరిశీలన కోసం అవసరమైన మెటీరియల్ను వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలి. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను, వాటి రెండు సెట్ల జిరాక్సు ప్రతులను తీసుకురావాలి. నిర్ణీత తేదీలు, రిజర్వుడే రోజున ధ్రువపత్రాలు తీసుకురాని వారికి తదుపరి సమయం ఇవ్వబోం. ధ్రువపత్రాల పరిశీలనకు ఎవరైనా గైర్హాజరైనా, ఎవరిదైనా అభ్యర్థిత్వం తిరస్కరణకు గురైనా, ఆప్షన్లను నమోదు చేయకున్నా... వారి స్థానంలో తదుపరి మెరిట్ అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తాం'' అని వివరించారు.

## పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి

అమరావతి: రాష్ట్ర సొంత ఆదాయ వనరులు పెరిగితేనే అసలైన వృద్ధి అని, పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో బుధవారం ఆయన ఆదాయార్జన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా.. సొంత ఆదాయం పెంచుకునేలా.. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పని చేయాలి. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతోపాటు ఎక్కడ ఆదాయం తక్కువ వస్తుందో గుర్తించి, కారణాలు వెతికి చర్యలు తీసుకోవాలి. నోటీసుల జారీ, పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదుల ప్రక్రియ వరకు అంతా ఆన్లైన్లో జరగాలి. చెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డాటా సెంటర్, ఏపీసీటీడీ ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలి. ఏఐ వినియోగించి యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చు. ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను వందశాతం రాబట్టేలా అన్ని శాఖలు కృషి చేయాలి. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా వెయ్యిమందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ఎలాంటి ఆమోదాలైనా ఇవ్వాలి. సాంకేతికతను వినియోగించుకుంటే పన్ను చెల్లింపులు, అనుమతుల వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వ్యాపారులకు తెలియచేయాలి. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదు. వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం వారు పన్నులన్నీ చెల్లించేలా చూడాలి' అని సీఎం సూచించారు.

**రాష్ట్ర సొంత ఆదాయంలో 2.2% వృద్ధి**

202324 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 202425కి గాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2% వృద్ధి నమోదైంది. పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వృద్ధి 4.1% నమోదు కాగా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు.

## అమరావతిలో సొంతింటికి సీఎం శంకుస్థాపన

అమరావతి : అమరావతిలో సొంతింటి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి నిరాడంబరంగా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇంటి నిర్మాణం కోసం ఇటీవల వెలగపూడి రెవెన్యూ పరిధిలోని ఇ6 రోడ్డు పక్కన 5 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. ఉదయం 7.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు ఈ స్థలం వద్దకు చేరుకున్నారు. నైరుతి దిక్కున ప్రత్యేకంగా వేసిన పందిరి కింద మంగళవాద్యాలు, మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు, భువనేశ్వరి, దేవాంశ్లు ముందు వరుసలో కూర్చొని పూజలు చేశారు. వీరి వెనుక మంత్రి లోకేశ్, బ్రాహ్మణి కూర్చున్నారు. పూజ అనంతరం ముహూర్త సమయం 8.51 గంటలకు శంకుస్థాపన చేశారు. చంద్రబాబు కుటుంబానికి స్థలం విక్రయించిన వెలగపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు, శాంతకుమారి, గీత, శాంతికిరణ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు స్థలంలో కలియతిరిగారు. ఇంటిప్లాన్ను లోకేశ్ వివరించారు. అక్కడున్న ఇంజినీర్లు, కార్మికులను పలకరించారు.

*** అమరావతిలో ఇంటి నిర్మాణం... మా నిబద్ధతకు ప్రతీక: లోకేశ్**

అమరావతిలో ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేయడం... ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని మార్చడానికి తమకున్న నిబద్ధతకు ప్రతీక అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇది తమ కుటుంబానికి ఎంతో భావోద్వేగంతో నిండిన రోజు అని ఎక్స్లో పేర్కొన్నారు. ''ఎంతో గర్వం, కృతజ్ఞతలతో భూమిపూజ కార్యక్రమంలో నా తల్లి భువనేశ్వరి, బ్రాహ్మణి, దేవాంశ్లతో కలిసి భాగస్వామ్యం కావడం ఆశీర్వాదంగా అనిపించింది. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు కన్న కలలు సాకారం కానున్నాయి. కోట్ల మంది ప్రజల కలలకు జవసత్వాలు ఇచ్చే ఘట్టం ఇది'' అని లోకేశ్ పేర్కొన్నారు.

# కోళ్లను వేటాడిన కుక్కలు







* **పది పందెం కోళ్లు మృతి... పలు కోళ్లకు గాయాలు**
* **మనుషులపై దాడులు చేస్తే ఎవరిదీ బాధ్యత**
* **భయాందోళనకు గురవుతున్న రామవరంవాసులు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదారు గజ్జి కుక్కలు వీరవిహారం చేశాయి. కొత్తగూడె పట్టణం రామవరంలో గజ్జి పట్టిన వీధికుక్కలు పందెం కోళ్లను తరిమి తరిమి వేటాడాయి. బుధవారం తెల్లవారుజామున రామవరం 6వ వార్డులో నివాసముంటున్న రమేష్ పాసి ఇంట్లో వీధి కుక్కలు పందెం కోళ్లపై దాడి చేయడంతో పది కోళ్లు మృతి చెందగా, పలుకోళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రామవరం ప్రధాన రహదారిలో ఉన్న మటన్, చికెన్ దుకాణాల వద్ద పడవేసే వ్యర్థాలకు అలవాటు పడిన వీధి కుక్కలు ఆ వ్యర్థాలు దొరక్కపోవడంతో ఇలా కోళ్లపై దాడి చేసి వాటిని చంపి తింటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గులవుతున్నారు. మనుషులపై కూడా ఈ వీధికుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఇటీవల ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులను సైతం వెంటాడటంతో వారు పరుగులు పెట్టారు. ఇది గమనించిన స్థానికులు వీధి కుక్కలను తరిమికొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఇదే వార్డులో నివాసముంటున్న రఫీ అనే బాలుడు ఇటీవల ఓ వీధి కుక్కను గారాబంగా పెంచగా, ఒకరోజు ఆ కుక్క ఆ బాలుని కరిచింది. ఆ విషయాన్ని బాలుడు తల్లిదండ్రులకు చెప్పకుండా గోప్యంగా ఉంచడంతో ఫిబ్రవరి నెలలో కురిసిన వర్షానికి తడిసిన బాలుడు ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యం కోసం వరంగల్ ఎంజిఎంకు తల్లిదండ్రులు ఆ బాలుడిని తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే కుక్క కరవడం వలన రేబిస్ వ్యాధి సోకి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇలాంటి సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నా కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం సైతం ముగియడంతో రాజకీయ నాయకులు కూడా తీవ్రంగా ఉన్న వీధి కుక్కల సమస్యపై దృష్టి సారించడంలేదు. ఏది ఏమైనా వీధి కుక్కలకు గజ్జి సోకడంతో వాటివల్ల స్థానికులకు, చిన్నారులకు పెనుప్రమాదం పొంచి ఉందనేది వాస్తవం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను సమూలంగా నిర్మూలించాలని, వాటి భారి నుండి ప్రజల ప్రాణాలను రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

* **నేడు కోళ్లు... మరి రేపు**

### మనుషులపై దాడి చేస్తే ఎవరిదీ బాధ్యత..?

రామవరం ప్రాంతంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ముఖ్యంగా రామవరం ప్రధాన సెంటర్‌లోని కూడలి వద్ద నిలబడి ఉంటాలంటే కూడా ఉండలేని పరిస్థితి ఉంది. ఎప్పుడు ఎటువైపు నుండి ఏ కుక్క దాడి చేస్తుందో తెలియడంలేదంటూ స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రామవరం ప్రధాన సెంటర్‌లో ఉన్న మాంసాహార దుకాణాల వద్ద వ్యర్థాలను తినే కుక్కలకు గజ్జి సోకడంతో అవి వీధులవెంబడి తిరుగుతూ స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మాంసాహార దుకాణాల వద్ద వాటికి అవసరమైన ఆహారం దొరక్కపోవడంతో అవి ఇళ్లలోకి వచ్చి కోళ్లు వంటి వాటిపై దాడికి పాల్పడుతున్నాయి. అంతే కాకుండా వీధుల్లో స్వైరవిహారం చేయడం వల్ల చిన్నారులు, పెద్ద వారు, ముసలి వారు భయాందోళనకు గురై తమపై దాడి చేస్తే పరిస్థితి ఏమిటని ఆవేదన చెందుతున్నారు. కుక్కలు దాడులు చేసిన ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల నుండి తమకు రక్షణ కల్పించకపోతే ఆందోళనకు దిగుతామని రామవరం ప్రాంతవాసులు హెచ్చరిస్తున్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసిన యాదగిరిగుట్ట డిపో మేనేజర్



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా డిపో పరిస్థితులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అడిగి తెలుసుకున్నారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు కూడా ఆర్టీసీ సేవలు అందించాలని తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారి రెహమాన్ సూచనలతో కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ లో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు సిబ్బంది , వారి కుటుంబాలకు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి మంచి స్పందన లభించింది. శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో పోలీస్ అధికారులు, సిబ్బంది కొరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి శరీరంలోని అన్ని అవయవాలలో కళ్ళు చాలా ప్రధానమైనవి అని అన్నారు.ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కంటిచూపును ఎప్పటికప్పుడు సరిగా కాపాడుకోగలిగితేనే మన దైనందిన కార్యక్రమాలను సరిగ్గా చేసుకోగలమని తెలిపారు.పోలీసు అధికారులు,సిబ్బంది , కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు కంట పరీక్షలు చేయించుకోవాల్సిందిగా కోరారు.అనంతరం ఈ కార్యక్రమంలో సుమారుగా 300 మందికి పైగా కంటి పరీక్షలు (స్క్రీనింగ్,డిస్టెన్స్ విజిబిలిటీ టెస్ట్) చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్ టౌన్ సిఐ కరుణాకర్, 2టౌన్ సీఐ రమేష్, 3టౌన్ సీఐ శివప్రసాద్,జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి,ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు,నరసింహారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బొందుగులలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజాపేట , ప్రజాస్ఫూర్తి : రాజపేట మండలంలోని బొందుగుల గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నూతనంగా ఏర్పాటుచేసిన భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ లు హాజరయ్యారు ఈ సందర్భంగా ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పేదల కోసం పనిచేసే పార్టీ సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో అంత్యోదయ సిద్ధాంతంతో పనిచేస్తుందని అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సత్తా చాటాలని అన్నారు. జమిలి ఎన్నికల గురించి ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలని తిప్పి కొట్టాలన్నారు. జెమిలి ఎన్నికల వల్ల ఖర్చు తక్కువవుతుందన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ భారతీయ జనతా పార్టీ అనే ఆ రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ను ఓడించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. 70 సంవత్సరాలు పరిపాలించి కనీసం అంబేద్కర్ కు భారతరత్న కూడా ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ ,సీనియర్ నాయకులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ పుట్ట వీరయ్య సీనియర్ నాయకులు శీలం పాపిరెడ్డి, మండల కన్వీనర్ మెండు భగవాన్ రెడ్డి,చాపురం శ్రీశైలం, గుజ్జు రాంచేంద్రం, రాజం నగేష్ యాదవ్, మార్క శివ, ముత్యం రాజు, వట్టెం శ్రీకాంత్ పొనమోయిన రాజు, బండ ఆంజనేయులు, అమరాజు సిద్ధులు, అమరాజు శ్రీనివాస్, అమరాజ నర్సింలు, గుండగొని అజిత్, కోనేటి శ్రీరామ్, తరిగొప్పుల భాస్కర్, రాజ మయిన కుమార్, కోనేటి శ్రవణ్ ,కాకల్లా నవీన్, పిట్టల పోచయ్య, మునిగంటి వెంకటేష్, చెల్మనపల్లి పుల్లయ్య, చెప్పాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గం లోని ఎనిమిది మండలాలకు చెందిన 470 మంది లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు .లబ్ధిదారులకు కడుపు నిండ భోజనం చేయించి దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి రవాణా సౌకర్యం కోసం ఖర్చులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అద్దుతాయని మధ్యలో ఏ దళారులను నమ్మవద్దని అన్నారు. అందుకే నేను దగ్గరుండి ఈ సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు.

## రాజపేట తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్





రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట లోని తహసిల్దార్ కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, మండలంలోని రెవెన్యూ సమస్యల వివరాలను తహసిల్దార్ ఇంద్రకర్ అనిత, నాయబ్ తహసిల్దార్ షేరి వెంకటేశ్వర్లు రెడ్డి, ఆర్ఐ నరసింహులు ద్వారా అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు ఇచ్చారు. కార్యాలయంలో గైర్హాజరుగా ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 515 కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు, అందులో భాగంగా రాజపేట మండలంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు త్వరలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వివరించారు. సర్వర్ లో సమస్యలు కారణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆలస్యంగా జరుగుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి వచ్చింది.

## ఘనంగా బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం



యాదాద్రి భువనగిరి జిల్లా , ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం లో భాగంగా భువనగిరి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, వడాయి గూడెం, చీమల కొండూరు గ్రామాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ విచ్చేసి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ స్థాపించి 45 సంవత్సరాలు పూర్తయినందున కార్యకర్తలకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆరోజు రెండు సీట్లున్న బిజెపి ఈరోజు వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు ప్రతి కార్యకర్త గర్వించదగ్గ విషయమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుపొందాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చీర్కా సురేష్ రెడ్డి, మండల ఇంచార్జ్ పట్నం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు నాగు వినోద్ కుమార్, మాటూరు అనిల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి సురేష్‌గౌడ్ మాజీ మండల అధ్యక్షులు వెంకటేశం మట్ట ఆంజనేయులు, నల్ల మాస్ శేఖర్ గౌడ్, బూత్ అధ్యక్షులు ఎనబోయిన మహేష్, మధు, శెట్టి వంశీ యాదవ్, శ్రీధర్ నాయకులు భువనగిరి సిద్దు గౌడ్, కొత్తపెల్లి చంద్రశేఖర్, వల్లపు సతీష్, సాధినేని ఉపేందర్, వెంకటేష్ నాయక్, తోటకూరి అశోక్, సర్దార్ శ్రీకాంత్, దంతూరి భాస్కర్, శేఖర్, బబ్బూర్ శంకర్ గౌడ్, రవి, కర్ణాకర్, బెజ్జాల శ్రీనివాస్, స్వామి, వినయ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఎన్ ఎస్ యూ ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

: **భీమనపల్లి శివ**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలోని రాజీవ్ స్మారక్ భవన్ వద్ద ఎన్ ఎస్ యూ ఐ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యూ ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర కార్యదర్శి భీమనపల్లి శివ హాజరయ్యారు. ఎన్ ఎస్ యూ ఐ జెండాను ఎగరవేశారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకుడు బోయ రామచంద్రం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ఎన్ ఎస్ యూ ఐ మండల అధ్యక్షుడు బోయ నవీన్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పోతగాని శివ, ఎర్ర శ్రీధర్, బోయ శివ, బోయ ప్రకాష్, యువజన కాంగ్రెస్ నాయకులు బోయ నిరంజన్, బోయ సంపత్, తూర్పింటి వంశి, బోయ అరవింద్, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

*** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

రాజాపేట ,ప్రజాస్ఫూర్తి : ప్రజలు చేసుకున్న దరఖాస్తులు పెండింగ్ లేకుండా , ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.బుధవారం రాజాపేట మండలాల తాహశీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ధరణి లో తప్పుడు రిపోర్ట్ పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.మండల సర్వేయర్ వద్ద సర్వే కోసం వచ్చిన అప్లికేషన్ లను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంట వెంటనే పరిష్కరించి ప్రజలకు అందించాలన్నారు.రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన ఎంక్వయిరీ చేసి దరఖాస్తుదారులకు అందించే విధంగా చూడాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి



అర్హులైన లబ్ధి దారులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కి ఆదేశాలు జారీ చేశారు.ఇందిరమ్మ ఇండ్లలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం ఈ నెల 14 వ తేదిన గడువు ముగియునందున్న ప్రజలకు అవగాహన కల్పించి లబ్ధింపొందేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దేశ్యా నాయక్, సంబంధిత అధికారులకు పాల్గొన్నారు.

## హ్యాపీ డెంటల్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఏ ఎస్ రవు నగర్ డివిజన్ పరిధిలోని జి ఆర్ రెడ్డి నగర్ లొ నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ డెంటల్ ని ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భగా నిర్వహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిన బిజెపి

*** బిజెపి మండల ప్రధాన కార్యదర్శి భాద నరేష్**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా బిజెపి అవతరించిందని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి భాద నరేష్ అన్నారు. ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఎంపీ స్థానాల నుంచి మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారం చేపట్టి ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి విస్తరించిందని అన్నారు. అలాగే రాబోయే కాలంలో తెలంగాణ గడ్డ మీద కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు ఊరడి రాజు యాదవ్, పీట్ల ఎల్లం, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బొమ్మన ఆంజనేయులు , గూడ బలిశ్వర్ రెడ్డి, గున్నాల రమేష్, వడ్డే కుంటయ్య, సంతోష్, రాజు తదితరులున్నారు.

## విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతున్న ఎన్ఎస్‌యుఐ

**- ఘనంగా ఎన్ఎస్‌యుఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ఎన్ఎస్‌యుఐ ముందుండి పోరాడు తుందని ఎన్ఎస్‌యుఐ నాయకులు మిడిదొడ్డి భాను కుమార్ అన్నారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యుఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అర్థ శతాబ్దానికి పైగా ఎన్ఎస్‌యుఐని నడిపించిన అంకితభావం, కృషి, దార్శనికతను మనం స్మరించు కోవాలని, విద్యార్థి నాయకత్వానికి





మార్గనిర్దేశం చేసే ఎన్ఎస్‌యుఐ ఎల్లప్పుడూ నాణ్యమైన విద్య, యువత సాధికారత, సామాజిక సమానత్వం కోసం పోరాటంలో బలంగా నిలిచిందని అన్నారు. 55 సంవత్సరాల ఐక్యత, పురోగతి, సానుకూల మార్పునకు ఇది నిదర్శనమని, గత 55 సంవత్సరాల నుండి విద్యార్థుల సమస్యల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి విద్యార్థుల సమస్యలకు కృషి చేయడం జరిగిందని, రానున్న రోజులలో కూడా విద్యార్థి సమస్యలకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సాయి, ఉపాధ్యక్షులు సురేష్, నియోజక వర్గ అధ్యక్షులు సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్, భాను, వెంకటేష్, ఆకాష్ పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ ఒక విధ్వంసక వ్యాధి

- **బెట్టింగ్‌కు వ్యసనమైతే అదే మనల్ని నలుగురిలో నిలబెడుతుంది**
- **ఐపిఎల్ మ్యాచ్‌లు చూసి ఆనందించాలే తప్పా పెడదారిన పడకండి**
- **ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: క్రికెట్ బెట్టింగ్ ఒక విధ్వంసక వ్యాధని, ఒక్కసారి బానిస అయితే కుటుంబం మొత్తం బాధ పడుతుందని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ హెచ్చరించారు. ఐపిఎల్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో ప్రదానంగా యువతను ఉద్దేశించి బెట్టింగ్‌ల వల్ల కలిగే నష్టాలను, దాని ఫలితంగా దారి తీసే పరిస్థితులను ఒక ప్రకటనలో వివరించారు. బెట్టింగ్‌లు పాల్గొనే వారు మొదట సరదాగా కాస్తారని, మొదటి సారి, రెండవ సారి వస్తుందని, దీంతో వారిలో ఆశ మొదలవుతుందని తెలిపారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాస్తారని, ఈసారి వచ్చిన సొమ్ము, అదనపు వడ్డీతో సహా మొత్తం పోతుందని తెలిపారు. బెట్టింగ్‌కు ఒక్కసారి వ్యసన పడితే ఏదో ఒక రోజు అదే మనల్ని నలుగురిలో నిలబెడుతుందని హెచ్చరించారు. బెట్టింగ్‌లో లాస్ అయ్యి, పరువును కాపాడుకోలేక నలుగురిలో అవమానం పడి, సమాజంలో తలెత్తుకోలేక మృతి చెందడం, ఊరు వదలి వెళ్లిపోవడం, ఇలా అనేక కోణాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్లు జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని యువత ఎలాంటి బెట్టింగ్‌లకు పాల్పడవద్దని సూచించారు. బెట్టింగ్ దందాపై పోలీసు నిఘా ఉందని హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్న వారు నిఘాలో బయట పడితే ఖచ్చితంగా గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఐపీఎల్ మ్యాచ్లు క్రికెట్ గ్రౌండ్‌లో ఆట, కానీ బయట ఒక పెద్ద బిజినెస్, ఒక క్రికెట్ నిర్వహణకు లక్షలల్లో ఖర్చులు అయితే బెట్టింగులు మాత్రం కోట్లలో పడగలెత్తుతున్నారని, చిన్న చిన్న బెట్టింగులకు పాల్పడి మధ్య తరగతి కుటుంబాలు చిన్నా బిన్నం అయిపోతున్నాయని, కుటుంబాలే రోడ్డున పడుతున్నాయన్నారు. ఐపిఎల్ మ్యాచులను కేవలం చూసి ఆనందించాలే తప్పా, వేరే చెడు మార్గాల ద్వారా పెడ దారిన పడవద్దని ఆయ సూచించారు. బెట్టింగ్‌కి పాల్పడినట్టు తెలిసినా వెంటేనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## తిరుమలనాథ స్వామి ఆలయ నూతన కమిటీ డైరెక్టర్ గా గట్టు ప్రశాంత్



జనగామ జిల్లా , ప్రజాస్ఫూర్తి : స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి ఆలయ ఛైర్మన్ గా నీల నర్సింహులును ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంపిక చేశారు. మంగళవారం ఆలయ నూతన కమిటీకి కడియం నియామక పత్రం అందించారు. ఆలయ ఛైర్మన్ గా నీల నర్సింహులు, వైస్ ఛైర్మన్ తాటికొండ యాదగిరి, డైరెక్టర్లుగా గట్టు ప్రశాంత్, గౌరిశెట్టి శ్రీనివాస్, పిట్ట లక్ష్మీనారాయణ, మునిగల కుమారస్వామి, రాములు, గుంటి శేఖర్, ఎల్లయ్య, గట్టు శ్రీవాణి ఎన్నికయ్యారు.

## నేటి నుంచి ఘనంగా బీజేపీ ఆవిర్భావం దినోత్సవం వేడుకలు



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బొమ్మల రామారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈ నెల పదవ తారీకు పార్టీ ఆవిర్భావ దినం సందర్భంగా మండలంలో చేపట్టవలసిన కార్యక్రమాలను ముఖ్య అతిథి కాదురి అచ్చయ్య దిశ నిర్దేశం చేసారు. బొమ్మల రామారం మండలం పార్టీ అధ్యక్షుడు మాలోత్ వినోద్ నాయక్ ముఖ్య అతిథి కదూరి అచ్చయ్య మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి బీదవాడి అభివృద్ధి కొరకు పార్టీ అహర్నిశలు కృషి చేస్తుందని ప్రపంచ దేశాలకు భారతదేశం దిక్సూచి అని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలోముందుకు దూసుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రవిశంకర్ ,కో కో కన్వీనర్ బాలరాజు,కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ మహేష్ గౌడ్,మాజీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి బీమరి రాజ,మరియు సీనియర్ నాయకులు ఎల్లా గౌడ్, గుండ్ల గోపాల్,పాండు,ముక్కెర్ల గణేష్, ప్రవీణ్ రెడ్డి, రాజు, పరమేష్,భాస్కర్ ,సతీష్, మహేష్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పేదల పెన్నిధి సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:పేదల పెన్నిధి సిఎం రేవంత్ రెడ్డి అని యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు, కేకే యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారురాలు గంధం అంజవ్వకు కల్యాణ లక్ష్మి చెక్ మంజూరు అయ్యింది. ఈ మేరకు బుధవారం గంధం అంజవ్వకు కల్యాణ లక్ష్మి చెక్కుతోపాటు చీరను ఆయన అందజేశారు. చెక్‌తోపాటు చీరను అందజేయడం పట్ల అంజవ్వ సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ డిప్యూటీ తహశీల్దార్ అపర్ణ తదితరులున్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తా

*** ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తీ స్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ట మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని ఫేజ్ 1 ఓం శాంతి బిల్డింగ్ గల్లీలో రెండు లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా



కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కి ,డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స వేణుగోపాల్, ఏఈ లింగారావు, కాలనీ అధ్యక్షులు శివరాం ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, శివప్రసాద్, ఎన్ఎన్ చారి, హరికృష్ణ, కాళిదాస్, దేవేందర్ కుమార్, బాలయ్య గౌడ్, చారి, మల్లేష్ గౌడ్, పూస రమేష్, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, నవీన్ ,కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ఐస్ క్రీమ్ ఫ్లేవర్ గుర్తించండి.. రూ. 3 లక్షలు గెల్చుకోండి

* ఏప్రిల్ 27న హై బిజ్ టీవీ ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్
* కర్టెన్ రైజర్ ఈవెంట్ లో పాల్గొన్న హీరోయిన్ కావ్య కల్యాణ్ రామ్
* హాజరైన బిగ్ బాస్ ఫేమ్ శ్వేత వర్మ, యాక్టర్ సమీర్






హైదరాబాద్, 09 ఏప్రిల్ (ప్రజాస్ఫూర్తి): ఐస్ క్రీమ్ లవర్స్.. మీరు ఎంతగానో ఎదురు చూస్తున్న హై బిజ్ టీవీ ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్ మళ్లీ వచ్చేస్తోంది. ఏప్రిల్ 27న ప్రోగ్రాం జరుగబోతోంది. ఈ నేపథ్యంలో కర్టెన్ రైజర్ ఈవెంట్ ను గ్రాండ్ గా నిర్వహించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ పక్కన ఉన్న ప్రీమియా మాల్ వేదికగా దీన్ని చేపట్టారు. హీరోయిన్ కావ్య కల్యాణ్ రామ్, బిగ్ బాస్ ఫేమ్ శ్వేత వర్మ, యాక్టర్ సమీర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

వారితో పాటు సుహాస్ బి. శెట్టి (ఫౌండర్ & సీఈవో, ఆర్గానిక్ క్రీమరీ బై ఐస్ బర్గ్ ఐస్ క్రీమ్స్), ఎం. రాజ్ గోపాల్ (మేనేజింగ్ డైరెక్టర్ హై బిజ్ టీవీ & తెలుగు నౌ), డాక్టర్ జె. సంధ్యారాణి (మేనేజింగ్ డైరెక్టర్ హై బిజ్ టీవీ ఎల్.ఎల్.పి) తదితరులు పాల్గొన్నారు. మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్ ను హై బిజ్ టీవీ గత రెండేళ్లుగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే..! ఈ సారి జరుగబోయేది 3వ ఎడిషన్. ఇందులో పాల్గొని.. కళ్లకు గంతలు కట్టుకుని ఐస్ క్రీమ్ టేస్ట్ చేసి దాని ఫ్లేవర్ చెప్పాల్సి ఉంటుంది. అలా ఎవరు ఎక్కువగా గెస్ చేస్తే వాళ్లే విజేతలుగా నిలుస్తారు. ఫస్ట్ ప్రైజ్ విన్నర్ లక్ష రూపాయలు గెలుచుకోవచ్చు. సెకండ్ ప్లేస్ లో నిలిస్తే 50 వేలు దక్కుతాయి. 3వ బహుమతిగా 25 వేలు అందిస్తారు. అలాగే 25 మంది లక్కీ డ్రా విన్నర్స్ ను కూడా ఎంపిక చేస్తారు. ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్ కు ఐస్ బర్గ్ ఐసీ క్రీమ్స్ ఆధ్వర్యంలోని ఆర్గానిక్ క్రీమరీ సహకారాన్ని అందిస్తోంది. ఏప్రిల్ 27న ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ పక్కన ఉన్న ప్రీమియా మాల్ లో ఈ కాంపిటీషన్ జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఈ పోటీలో పాల్గొనే వాళ్లు 250 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందులో 100 రూపాయల విలువచేసే ఐస్ క్రీమ్ వోచర్ ను రీడిమ్ చేసుకోవచ్చు. ఇక, కర్టెన్ రైజర్ లో భాగంగా హాజరైన గెస్ట్ లు కళ్లకు గంతలు కట్టుకుని.. ఐస్ క్రీమ్ టేస్ట్ చేసి.. ఫ్లేవర్ ఏంటో చెప్పారు. అక్కడున్న వారిని ఇదెంతగానో ఆకట్టుకుంది. మరి మీరు కూడా ఏప్రిల్ 27న జరిగే ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్ లో పాల్గొనాలనుంటే వెంటనే ఆన్ లైన్ లో రిజిస్టర్ అవండి. కర్టెన్ రైజర్ కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8008574747 నంబర్ లో సంప్రదించండి

## ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్షలో ప్రతిభ చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జాతీయస్థాయిలో నిర్వహించిన ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్షలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం టి సతీష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభ చాటడం పట్ల సంతోషంగా ఉందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ప్రథమ బహుమతి 1, ద్వితీయ బహుమతి 1, తృతీయ బహుమతి 2, నాలుగవ బహుమతి 2, ఐదో బహుమతి 2, కన్సలేషన్ బహుమతులు 96, ప్రత్యేక బహుమతులు 18లతో పాటు గోల్డ్ మెడళ్ళు సాధించారన్నారు. బహుమతులు సాధించిన




విద్యార్థులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. చౌటుప్పల్ లోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఘంట లతిక్ వర్ధన్ (4వ తరగతి) ప్రథమ బహుమతిగా లెనోవా టాబ్ ను గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం వెంకట్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత బాన్స్, కోఆర్డినేటర్ పి.కామేశ్వరి, ప్రైమరీ ఇన్చార్జి జె పరమేశ్వరి, డీన్ బి దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## మరిన్ని విజయాలు సాధించాలి

**: రాచకొండ సిపి సుధీర్ బాబు**

* **గ్రూప్-1లో 30వ ర్యాంకర్ శంతను కుమార్ రెడ్డికి కమీషనర్ అభినందనలు**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : రాచకొండ కమిషనరేట్లో స్పెషల్ బ్రాంచి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్ రెడ్డి కుమారుడు శంతను కుమార్ రెడ్డి ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ గ్రూప్ వన్ పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంక్, మల్టీజోన్ 2లో 12వ ర్యాంక్ సాధించిన సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. ఇలాగే ప్రిపరేషన్ కొనసాగించి యూపీఎస్సీ పరీక్షలలో కూడా ఉత్తీర్ణత సాధించాలి అని ఈ సందర్భంగా కమిషనర్ ఆకాంక్షించారు. టీజీపీఎస్సీ 30వ ర్యాంక్ సాధించిన శంతన్ కుమార్ రెడ్డి కూడా తండ్రి లాగానే డీఎస్పీ అవుతుండటం గమనార్హం.




## తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్‌రెడ్డి పడగొట్టారు: హరీశ్‌రావు

సంగారెడ్డి: తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్‌రెడ్డి పడగొట్టారని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సంగారెడ్డిలోని గణేశ్ గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ సభకు రాహుల్ గాంధీ దిల్లీలో ఉండి కూడా వెళ్లలేదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు డిప్యూటీ సీఎం ఉపసంహరించుకున్నారని చెప్పారు. అంటే రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా అని ప్రశ్నించారు. ''అక్రమ కేసులు పెట్టినందుకు రేవంత్‌రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ అంతా కేసీఆర్ వైపు చూస్తోంది. ఏడాది పాలనలో ప్రజలకు అన్నీ అర్థం అయ్యాయి.



50 శాతం రుణమాఫీ కూడా కాలేదు. రైతుబంధు, రూ.4 వేల పింఛన్, మహాలక్ష్మి పింఛన్ రాలేదు. జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలగొట్టారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుంది'' అని హరీశ్‌రావు తెలిపారు.

## తెలంగాణకే రొనాల్డ్‌రాస్.. మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారి శివశంకర్

హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. ఆయన తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. రొనాల్డ్‌రాస్‌ను తెలంగాణలోనే కొనసాగించాలని డీవోపీటీని క్యాట్ ఆదేశించింది. విభజన వేళ రొనాల్డ్‌రాస్‌ను డీవోపీటీ ఏపీకి కేటాయించింది. క్యాట్‌ను ఆశ్రయించి దాదాపు పదేళ్లపాటు తెలంగాణలోనే విధులు నిర్వహించారు. గత ఏడాది డీవోపీటీ... తిరిగి కొంతమంది ఐఏఎస్‌లను ఏపీకి కేటాయించింది. డీవోపీటీ ఆదేశాల మేరకు రొనాల్డ్ రాస్ గతేడాది ఏపీలో రిపోర్టు చేశారు. ఏపీలో



రిపోర్టు చేశాక మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. తనను తెలంగాణలోనే కొనసాగించాలని కోరారు. రొనాల్డ్‌రాస్ పిటిషన్‌పై విచారించిన క్యాట్.. ఆయనకు అనుకూలంగా ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు ఐఏఎస్ అధికారి శివశంకర్ క్యాట్‌లో కంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేశారు. క్యాట్ ఆదేశాలను డీవోపీటీ అమలు చేయడం లేదని పిటిషన్ వేశారు. శివశంకర్‌ను ఏపీకి కేటాయించాల్సిందిగా డీవోపీటీని ఫిబ్రవరి 28న క్యాట్ ఆదేశించింది. నాలుగు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలంది. డీవోపీటీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో శివశంకర్ మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. అయితే, ఉత్తర్వులు అమలు చేయడానికి డీవోపీటీ గడువు కోరింది. నాలుగు వారాల్లోగా ఉత్తర్వులు జారీ చేయాలని డీవోపీటీని మరోసారి క్యాట్ ఆదేశించింది.

## 50 రోజులైనా ఖరారు కాని దిల్లీ సీఎం అధికారిక నివాసం!



దిల్లీ సీఎంగా రేఖా గుప్తా అధికార బాధ్యతలు చేపట్టి 50 రోజులు గడిచి పోయాయి. అయినప్పటికీ ఆమెకు అధికారిక నివాసం కేటాయించలేదు. దీంతో షాలిమార్ బాగ్‌లోని తన నివాసం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ 25 కిలోమీటర్లు ప్రయాణించి సచివాలయానికి వెళ్తున్నారు. గతంలో కేజ్రీవాల్ నివసించిన బంగ్లాలోకి వెళ్లడానికి భాజపా సీఎం విముఖత వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో అది శీష్‌మహల్ అంటూ విమర్శలు గుప్పించడమే అందుకు కారణంగా తెలుస్తోంది. అందుబాటులో ఉన్న బంగ్లాలపై అధికారులు దృష్టిపెట్టినప్పటికీ.. ఆమె అధికారిక నివాసంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దిల్లీ ప్రభుత్వ ప్రజా పనుల విభాగం కొత్త అధికారిక నివాసం కేటాయింపు విషయంలో స్పష్టమైన పరిష్కారాన్ని గుర్తించలేకపోతోంది. దిల్లీ లేదా కేంద్ర ప్రభుత్వం అందించే ప్రభుత్వ

## '2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగామి.. 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్'

చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలతో ప్రపంచానికి తన సత్తాను చూపిన భారత్.. జాబిల్లిపై సొంత వ్యోమగామిని దించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలుమోపుతాడని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ ఆంగ్ల ఛానల్ ఏర్పాటు చేసిన 'రైజింగ్ భారత్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం 'భారత్ స్పేస్ స్టేషన్'ను 2035 నాటికి సమకూర్చుకుంటుందని ఆయన వెల్లడించారు. ఇక చంద్రయాన్3 మిషన్‌లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. భారత వైజ్ఞానిక సత్తాను ఇది ప్రపంచానికి చాటింది. దీంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరుకున్న తొలి దేశంగా రికార్డు సృష్టించింది. ఇప్పుడు చంద్రయాన్4పై దృష్టిసారించింది. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్ఠాత్మక చంద్రయాన్4 ప్రయోగాన్ని 2027లో చేపట్టనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎల్‌వీఎం3 రాకెట్‌ను కనీసం రెండుసార్లు ప్రయోగించి.. చంద్రయాన్4 మిషన్‌కు సంబంధించిన ఐదు భిన్న భాగాలను నింగిలోకి



పంపిస్తారు. వాటిని కక్ష్యలోనే బిగిస్తారు. చంద్రుడిపైకి భారత వ్యోమగామిని పంపించేంతవరకు చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయని ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఇక భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌ను వచ్చే ఏడాది చేపట్టనున్నారు.

**బాలికా వధు (చిన్నారి పెళ్లికూతురు) సమయానికి నాకు పెద్దగా నటన గురించి తెలియదు. డైలాగ్ చదివి వాటిని చెప్పమనేవారు. అప్పట్లో టీఆర్‌పీ అంటే కూడా తెలియదు. ఆ ధారావాహికకి మొదట 80 ఎపిసోడ్లకు మాత్రమే సంతకం చేశా. అది కాస్త 515 ఎపిసోడ్‌లు ప్రసారమైంది.**





# మా పెళ్లి అయిపోయింది

'చిన్నారి పెళ్లికూతురు'గా బుల్లితెరపై అలరించి.. 'ఉయ్యాల జంపాల'తో హీరోయిన్‌గా మారిన ముంబయి బ్యూటీ అవికా గోర్. బాలనటిగా కెరీర్ ప్రారంభించిన ఈ చిన్నది అల్లరిపిల్లగా, అందాల భామగా వరుస సినిమాలు చేస్తున్నది. ఉత్తరాదితోపాటు దక్షిణాదిన కూడా అభిమానులను సంపాదించుకున్నది. వరుస సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో ప్రేక్షకులను అలరిస్తున్న అవిక తాజాగా 'షణ్ముఖ' సినిమాతో మరోసారి టాలీవుడ్‌ని పలకరించింది. కొన్ని సినిమాలు నిరాశపరిచినా.. కెరీర్ పరంగా చాలా సంతోషంగా ఉన్నానంటున్న అవిక పంచుకున్న కబుర్లు.. మిలింద్ నా జీవితంలోకి వచ్చిన తర్వాత నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. అతని సాహచర్యంలో నా బలాన్ని, సామర్థ్యాన్ని గుర్తించా! నన్నెంతో ప్రోత్సహిస్తాడు. నేను బరువు తగ్గడం నుంచి నిర్మాతగా మారడం వరకు అన్నిట్లో మిలింద్ నా వెంటే ఉన్నాడు. తను లేకుంటే నేనిక్కడి వరకు వచ్చేదాన్నే కాదు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా మిలింద్ పరిచయమయ్యాడు. ఆరు నెలలపాటు స్నేహితులుగా ఉన్నాం. మా ఇష్టాయిష్టాలు కలిశాయి. నా అభిప్రాయాలకు అతనిచ్చే గౌరవం నాకెంతో నచ్చింది. మా మనసులు కలిశాయి. అంటే.. నా దృష్టిలో మానసికంగా మా పెళ్లి జరిగిపోయినట్టే. అవికా స్క్రీన్ క్రియేషన్స్ పేరుతో ఓ నిర్మాణ సంస్థ ప్రారంభించాం. ఇప్పటికి రెండు సినిమాలు తీశాం. మరిన్ని మంచి చిత్రాలు తీయాలన్నది నా కోరిక. 'నిర్మాతగా మారడం చాలా రిస్క్' అని చాలామంది హెచ్చరించారు. కానీ, నేను చాలెంజ్‌గా తీసుకున్నా. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా అభిమానుల ప్రేమ, ఆశీర్వాదాలే నన్ను ముందుకు నడిపిస్తాయి. ఒక నటిగా భిన్నమైన కథలకే మొగ్గు చూపుతాను. కథలో బలం ఉంటే.. అందులోని పాత్రలన్నీ పండుతాయి. దర్శకుడు, నటీనటులు, సినిమా బృందం అందరూ కష్టపడతారు. జయాపజయాలు మాత్రం ప్రేక్షక దేవుళ్లు నిర్ణయిస్తారు. సృష్టిలో ఏం జరిగినా.. దాని వెనక ఓ కారణం ఉంటుంది. మనం చేయాల్సిందల్లా కాలంతోపాటు ముందుకు సాగడమే. ఎప్పటికప్పుడు నన్ను నేను మెరుగుపర్చుకునే ప్రయత్నం చేస్తాను. కెరీర్ పరంగా, వ్యక్తిగతంగా చాలా విషయాలు నేర్చుకున్నా. సమస్యలు, అనుభవాలతోనే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని గ్రహించాను. ఇప్పటివరకూ నటన గురించే ఆలోచించాను. ఫిట్‌నెస్ మీద పెద్దగా దృష్టి పెట్టలేదు. కొద్దిగా బరువు పెరిగితే అందరూ 'బొద్దుపిల్ల' అంటున్నారు. అందుకే ఒకే బరువు మెయింటేన్ చేయాలని నిర్ణయించుకున్నా! బలంగా సంకల్పిస్తే.. ఏదైనా సాధించగలం. 15 ఏండ్ల వయసులో సినిమాల్లో హీరోయిన్‌గా నటించాలనే కోరిక ఉందని ఒక ఇంటర్వ్యూలో చెప్పా. మొదట మరాఠీ, గుజరాతీ సినిమాల్లో ఆఫర్లు వచ్చాయి. తర్వాత తెలుగులో చాన్స్ వచ్చింది. మొదట్లో తెలుగు అర్థం చేసుకోవడం కష్టమయ్యేది. ఇప్పటికీ తెలుగు మాట్లాడలేను కానీ, అర్థం చేసుకోగలను.

# ఇది తంజావూర్ రాజసం

**'ల్యాండ్ ఆఫ్ టెంపుల్స్'గా ప్రసిద్ధి చెందిన రాష్ట్రం తమిళనాడు. చోళులు, పాండ్యులు పాలించిన అరవదేశం.. దేవాలయాలతోపాటు భారీ ఆభరణాలకూ ప్రసిద్ధి. దేవతా ప్రతిబింబాలతోపాటు జంతువులు, పక్షులు, పూలు, పండ్లు ఇలా ప్రకృతి రూపాలు ఒదిగి రాజసం ఉట్టిపడే తంజావూరు జువెలరీ మరింత ప్రత్యేకం. సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యం కలిగిన తంజావూరు ఆభరణాలు ఈ కాలంలోనూ వన్నె తగ్గలేదు.**







భారతదేశంలోని ప్రాచీన కళాత్మక ఆభరణాలలో తంజావూర్ జువెలరీ ప్రత్యేకమైనది. ఈ ఆభరణాల ప్రత్యేక డిజైన్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన తంజావూరు నగలు చోళుల కాలం నుంచి ప్రాచుర్యంలో ఉన్నాయి. అందమైన నగిషీలతో రూపుదిద్దుకున్న భారీ నగలను చోళరాజులు ఆలయాల్లోని దేవతా మూర్తులకు సమర్పించేవారు. రాణులు కూడా వీటిని మురిపెంగా ధరించేవారు. ఈ తంజావూర్ ఆభరణాల తయారీ పద్ధతులు తరువాతి కాలంలో విజయనగర రాజుల హయాంలోనూ కొత్తపుంతలు తొక్కాయి. అలా చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని దక్కించుకున్నాయి. నేటికీ అదే స్థాయిలో అమ్ముడవుతున్నాయి. తంజావూరు ఆభరణాల తయారీలో ఉపయోగించే ప్రధాన ముడిసరుకు బంగారం, వెండి. నగలపై రత్నాలు, రంగురంగు గాజుముక్కలను అమర్చి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు డిజైనర్లు. పచ్చలు, కెంపులు, నీలాలు, ముత్యాలు, ఇతర విలువైన రాళ్లు ఈ నగలకు అదనపు మెరుపును అందిస్తాయి. ఆకులు, పూల డిజైన్లతో రూపొందిన నగలకు డిమాండ్ ఎక్కువ. దేవతా మూర్తులతో తయారైన నగలకూ ఆదరణ ఉంది. కొన్ని ఆభరణాలు జ్యామితీయ నమూనాలతో ఆకట్టుకుంటాయి. మోల్డింగ్, ఫిలిగ్రీ, ఎనామెల్ లాంటి పద్ధతుల్లో తయారైనవీ కనిపిస్తాయి. నేటికీ వీటికి ఆదరణ తగ్గలేదు. వివాహాది శుభకార్యాలకు, సంప్రదాయ వస్త్ర శ్రేణికి తంజావూరు నగలు భలేగా నప్పుతాయి. ఖరీదు ఎక్కువే అయినా.. ఇవి అందించే రాజసం, ఆనందం ముందు తక్కువే అనిపిస్తుంది. ఇమిటేషన్, వన్‌గ్రామ్ జువెలరీలోనూ తంజావూరు నగలు అందుబాటులో ఉన్నాయి. ఎందుకు ఆలస్యం ఈ సంప్రదాయ నగలు ధరించి.. ఈ పెండిండ్ల సీజన్‌లో ప్రత్యేకంగా మెరిసిపోండి.

# పెదాలకీ మాస్క్

**ఎండ వేడికి చర్మమే కాదు... పెదాలూ నల్లబడతాయి. పోగొట్టుకోవాలంటే...**

అరస్పూను చొప్పున తేనె, నిమ్మరసం తీసుకుని బాగా కలపాలి. దీన్ని పెదాలకు పట్టించి, పది నిమిషాలయ్యాక కడిగేయండి. నిమ్మ పిగ్మెంటేషన్‌ని పోగొడితే తేనె తేమను అందిస్తుంది.

* నాలుగు గులాబీ రేకలను స్పూను పాలల్లో నాలుగైదు గంటలు నానబెట్టండి. తరవాత రేకలను పాలతో కలిపి మెత్తగా మెదిపి, పెదాలకు పట్టించండి. పావుగంటయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.
* బీట్‌రూట్ లేదా క్యారెట్ చిన్న ముక్క తీసుకుని మెత్తగా దంచండి. ఆపై ఆ రసాన్ని పెదాలకు రాసి, రాత్రంతా వదిలేయండి. సహజ గులాబీదనం పెదాలకు వచ్చేస్తుంది.





## వాణిజ్య యుద్ధ భయాలు...

### నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

### 379 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

### 136 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

### 3 శాతానికి పైగా పతనమైన ఎస్బీఐ షేర్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించినప్పటికీ... వాణిజ్య యుద్ధ భయాలు మదుపరులను వెంటాడాయి. ఈ క్రమంలో, బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 379 పాయింట్లు నష్టపోయి 73,847కి పడిపోయింది. నిఫ్టీ 136 పాయింట్లు కోల్పోయి 22,399 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 86.69గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:** నెస్లే ఇండియా (3.24%), హిందుస్థాన్ యూనిలీవర్ (2.63%), టైటాన్ (1.66%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (1.56%), అల్ట్రాటెక్ సిమెంట్ (1.03%).

**టాప్ లూజర్స్:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (-3.43%), టెక్ మహీంద్రా (-3.35%), ఎల్ అండ్ టీ (-3.23%), టాటా స్టీల్ (-2.30%), సన్ ఫార్మా (-2.18%).

## అతి త్వరలో ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు..

### మరో బాంబు పేల్చిన ట్రంప్





**టాకీస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. భారత్ సహా పలు దేశాలపై టారిఫ్‌లు ప్రకటించారు. తాజాగా మరో బాంబు పేల్చారు అధ్యక్షుడు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు.

మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. అమెరికాలో ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని వ్యాఖ్యానించారు. కాగా, ఏప్రిల్ 2న భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, వీటిలో ఔషధ ఉత్పత్తులకు తాత్కాలికంగా మినహాయింపు లభించింది. ఇప్పుడు వాటిపై కూడా త్వరలోనే సుంకాలు విధించనున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే.. భారత ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులకు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. అమెరికా ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన ఔషధాలు అందడంలో భారతీయ ఫార్మా కంపెనీలది కీలకపాత్ర. భారత్ అమెరికాకు చేసే ఔషధ ఎగుమతులు ఎక్కువగా జనరిక్ మందులే ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం.

అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వచ్చినవే. సిప్లా, లుపిన్, సన్ ఫార్మా వంటి సంస్థలతో పోల్చితే జనరిక్ ఔషధాలను భారీగా ఉత్పత్తి చేస్తున్న జైడస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలపైనే అమెరికా టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫార్మా కంపెనీలు.. అమెరికా మార్కెట్ నుంచి ఐరోపా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపునకు వెళ్లడమే ఉత్తమమని ఔషధ రంగ నిపుణులు భావిస్తున్నారు.

## మార్కెట్‌కు క్యూ కడుతున్న టాప్ కార్లు..

### ఫీచర్స్ విషయంలో తగ్గేదేలే..!






**న్యూఢిల్లీ:** భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో హారియర్ ఈవీ కారును ఈ నెలలోనే రిలీజ్ చేయనుంది. బ్యాటరీతో నడిచే ఈ ఎస్‌యూవీ టాటాకు సంబంధించిన యాక్టి డాట్ ఈవీ ఆర్కిటెక్చర్ ఆధారంగా డ్యూయల్ మోటార్ ఆల్-వీల్ డ్రైవ్ సిస్టమ్‌తో వస్తుంది. ఈ కారు పీక్ టార్క్ 500 ఎన్ఎంగా రేట్ చేశారు. ఈ కారు అంచనా ధర రూ. 23 లక్షలుగా ఉండనుంది.

ఎంజీ మోటార్ కంపెనీకు సంబంధించిన సీబీయూ మోడల్ సైబర్‌స్టర్‌ను ఈ నెలలోనే మార్కెట్‌లో రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఈ ఆల్-ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్‌ను ఎంజీ సెలెక్ట్ షోరూమ్‌ల ద్వారా విక్రయించనున్నారు. సైబర్‌స్టర్ కోసం ప్రీ-బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు డ్యూయల్-మోటార్, ఆల్-వీల్ డ్రైవ్ సెటప్‌ను కలిగి ఉంటుంది. ఈ డ్యూయల్-మోటార్ సెటప్, 504 బీహెచ్‌పీ, 725 ఎన్ఎం పీక్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఆఫర్‌లో నాలుగు డ్రైవ్ మోడ్‌లు ఉన్నాయి. కంఫర్ట్, కస్టమ్, స్పోర్ట్, ట్రాక్. డ్యూయల్-మోటార్ సెటప్ 77 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ నుంచి శక్తిని పొందుతుంది. ఈ కారు ఒకే ఛార్జ్‌లో 444 కి.మీ.ల పరిధిని హామీ ఇస్తుంది. ఈ కారు అంచనా ధర రూ. 75 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది.

ప్రముఖ కంపెనీ స్కోడా చాలా కాలం తర్వాత సెకండ్ జెనరేషన్ కోడియాక్‌ను భారతదేశంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. ఈ కారు 187 బీహెచ్‌పీ, 320 ఎన్ఎం పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేసే 2.0 లీటర్ టీఎస్ఐ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్‌తో అందించే అవకాశం ఉంది. మిడ్ 7 స్పీడ్ డీఎస్‌జీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో వచ్చే ఈ కారు అంచనా ధర రూ. 30 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది.

భారతదేశంలో ప్రముఖ కార్ల కంపెనీగా ప్రాచుర్యం పొందిన వోక్స్‌వ్యాగన్ తన సరికొత్త కారు టిగువాన్‌ను ఏప్రిల్ 14న రిలీజ్ చేయనుంది. టిగువాన్ ఆర్ లైన్‌పేరుతో సీబీయూ మోడల్‌గా ఈ కారు రిలీజ్ చేస్తున్నారు. ఈ కారు 7-స్పీడ్ డ్యూయల్ క్లచ్ డీఎస్‌జీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో జత చేసి 2.0 లీటర్ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్ ద్వారా పని చేస్తుంది. ఇండియా స్పెక్ టిగువాన్ ఆర్ లైన్ 201 బీహెచ్‌పీ, 320 ఎన్ఎం పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

# హై స్కోరింగ్ మ్యాచ్‌లో
# రాజస్థాన్ చిత్తు చిత్తు

### గడగడలాడించిన గుజరాత్!

### రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ ఘన విజయం

### 58 పరుగుల తేడాతో విజయం సాధించిన గిల్ సేన

### మూడో ఓటమిని మూటగట్టుకున్న రాజస్థాన్ రాయల్స్




**అహ్మదాబాద్:** ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓటమిపాలయింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో విఫలమైన రాయల్స్ ఈ సీజన్‌లో మూడో ఓటమిని మూటగట్టుకున్నారు. హోం గ్రౌండ్‌లో గుజరాత్ టైటాన్స్



ఎలక్ట్రిఫయింగ్ పర్ఫార్మెన్స్‌తో విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులకే ఆలౌట్ కావడంతో రాజస్థాన్ రాయల్స్ 58 పరుగుల తేడాతో విజయం సాధించింది.

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ పోరాడినప్పటికీ గుజరాత్‌నే విజయం వరించింది. ఆఖర్లో షిమ్రోన్ హెట్మెయర్ మెరుపులు మెరిపించినా అప్పటికే పరిస్థితి చేజారిపోయింది. యశస్వి జైస్వాల్, నితీష్ రాణా, ధృవ్ జురెల్ సింగిల్ డిజిట్‌కే వికెట్లు కోల్పోయారు. రియాన్ పరాగ్ దురదృష్టవశాత్తు వికెట్ కోల్పోవడంతో రాజస్థాన్ రాయల్స్ ఓటమి తప్పలేదు.

యశస్వి జైస్వాల్ ఏడు బంతుల్లో ఆరు పరుగులు చేసి అవుటవగా, ఆ వెంటనే వచ్చిన నితీష్ రాణాని కేవలం ఒక్క పరుగుకే మహమ్మద్ సిరాజ్ అవుట్ చేశాడు. రియాన్ పరాగ్ 14 బంతుల్లో ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 26 పరుగులు, ధృవ్ జురెల్ 4 బంతుల్లో ఐదు పరుగులు చేసి అవుటయ్యాడు. కెప్టెన్ సంజూ శాంసన్ 28 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 41 పరుగులు చేసి థర్డ్ మ్యాన్‌కి క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఇంపాక్ట్ ప్లేయర్ శుభమ్ దుబే 3 బంతుల్లో కేవలం ఒక్క పరుగే చేయగా, జోఫ్రా ఆర్చర్ నాలుగు బంతుల్లో నాలుగు పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టారు.

### హెట్మెయర్ హాఫ్ సెంచరీ

షిమ్రోన్ హెట్మెయర్ ఒంటరి పోరాటంతో ఆఖరి వరకూ పోరాడాడు. వీలు చిక్కినప్పుడు బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు. రన్‌రేట్ తగ్గకుండా తక్కువ మార్జిన్‌తో మ్యాచ్‌ను గెలిపించే ప్రయత్నం చేశాడు. ఫోర్లు, సిక్సర్లతో 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన హెట్మెయర్ 32 బంతుల్లో 52 పరుగులు చేసి అవుటయ్యాడు.

తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు భారీ లక్ష్య ఛేదనలో విఫలమై 159 పరుగులకు ఆలౌట్ అయింది. దాంతో గుజరాత్ టైటాన్స్ జట్టు 58 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో గుజరాత్ ఐదు మ్యాచ్‌లలో నాలుగో విజయాన్ని సొంతం చేసుకోగా, రాజస్థాన్ రాయల్స్ మూడో ఓటమిని మూటగట్టుకుంది.

## పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్‌కు జరిమానా..

### 25శాతం మ్యాచ్ ఫీజులో కోత..!

**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు పంజాబ్ కింగ్స్ ఆల్ రౌండర్ జరిమానా విధించారు. మాక్స్‌వెల్‌కు మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్‌ని జోడించారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2లోని లెవల్ 1 తప్పదానికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయానికి మ్యాక్స్‌వెల్ సైతం అంగీకరించాడని, దాంతో మ్యాచ్‌ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, మ్యాక్స్‌వెల్ చేసిన తప్పేంటో మాత్రం చెప్పలేదు. సీఎస్‌కేతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ బ్యాటింగ్‌లో విఫులమయ్యాడు. కేవలం ఒక పరుగు చేసిన పెవిలియన్‌కు చేశాడు. సీఎస్‌కే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది.

పంజాబ్ జట్టు ప్రస్తుతం నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, ఒక ఓటమితో ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉంది. ఇదిలా ఉండగా.. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఒక ఆటగాడికి జరిమానా విధించడం ఇదే తొలిసారి కాదు. ఈ ఐపీఎల్ సీజన్‌లో పలువురు ఆటగాళ్లకు జరిమానా విధించారు. వివాదాస్పద రీతిలో సంబరాలు చేసుకున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన దిగ్వేష్ రాఠీకి మూడుసార్లు జరిమానా విధించగా.. అదే సమయంలో రిషబ్ పంత్, ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్,




ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా, మొదటి మూడు మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్‌కు నాయకత్వం వహించిన రియాన్ పరాగ్, గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మలకు సైతం జరిమానా విధించారు.

## కాజీరంగా నేషనల్ పార్క్‌లో
## సచిన్ జీపు సఫారీ..

**అస్సాం:** వీడ్కోలు అనంతరం క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ తన విలువైన సమయాన్ని కుటుంబం కోసం కేటాయిస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఫ్యామిలీతో కలిసి ట్రిప్‌కు వెళ్తూ సందడి చేస్తున్నారు. అంతేకాదు, సోషల్






మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ తనకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటున్నారు.

సచిన్ తాజాగా తన కుటుంబంతో కలిసి అస్సాంలో పర్యటించారు. అక్కడి కాజీరంగా నేషనల్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో జీపు సఫారీ చేస్తూ సందడి చేశారు. అంతేకాదు.. అక్కడ ఏనుగులకు ఆహారం కూడా అందించారు. ఈ సందర్భంగా అక్కడ ఎంతో సరదాగా గడిపారు. సచిన్ రాకపై సమాచారం తెలుసుకున్న అభిమానులు.. భారీగా అక్కడకు చేరుకున్నారు. ఆయనతో సెల్ఫీలు, ఫోటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## జరిమానా విధించినా తగ్గని దిగ్వేశ్ రథీ..

### కొత్త తరహా సెలబ్రేషన్స్‌తో వివాదం..

**కోల్‌కతా:** లక్నో సూపర్ గెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రథీ.. మళ్లీ వివాదాస్పద రీతిలో సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. ఐపీఎల్‌లో మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో అతను వికెట్ తీసిన తర్వాత కొత్త తరహాలో సంబరాలు చేసుకున్నాడు. తన అభిమాన స్పిన్నర్ సునిల్ నరైన్‌ను ఔట్ చేసిన తర్వాత దిగ్వేశ్ గ్రౌండ్‌పై రాస్తున్నట్లుగా సెలబ్రేట్ చేసుకున్నాడు. నోట్‌బుక్ సెలబ్రేషన్ బదులుగా.. మైదానంలో గడ్డిమీద పేరు రాస్తూ సంబురాలు చేసుకొని మళ్లీ వివాదంలో చిక్కుకున్నాడు. ఇప్పటికే పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రియాన్ష్ ఆర్యాను ఔట్ చేసి నోట్‌బుక్ సంబరాలు చేసుకున్న రథీకి జరిమానా వేసిన విషయం తెలిసిందే. ఈసారి ఐపీఎల్‌లో రెండు సందర్భాల్లో అతనికి జరిమానా విధించారు. కొత్త తరహాలో సంబరాలు చేసుకున్న దిగ్వేశ్‌కు ఇప్పుడు బీసీసీఐ ఎటువంటి శిక్ష వేస్తుందో చూడాల్సిందే.

కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఈడెన్‌గార్డెన్ వేదికగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్‌లో



విజయం కోసం ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డా లక్నోనే గెలుపు వరించింది. లక్నో నిర్దేశించిన 239 పరుగుల ఛేదనలో కేకేఆర్ 4 పరుగుల దూరంలో ఆగిపోయింది. పూరన్ (36 బంతుల్లో 87 నాటౌట్, 7 ఫోర్లు, 8 సిక్సర్లు), మార్ష్ (48 బంతుల్లో 81, 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మార్క్రమ్ (28 బంతుల్లో 47, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరవిహారంతో లక్నో.. నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 238 పరుగుల రికార్డు స్కోరు చేసింది. భారీ ఛేదనలో కేకేఆర్.. 20 ఓవర్లలో 234/7 వద్దే ఆగిపోయింది. కెప్టెన్ అజింక్యా రహానే (35 బంతుల్లో 61, 8 ఫోర్లు, 2 సిక్సర్లు),వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 45, 6 ఫోర్లు, 1 సిక్స్)తో పాటు ఆఖర్లో రింకూ సింగ్ (15 బంతుల్లో 38 నాటౌట్, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు.



## 'కన్నప్ప' రిలీజ్ డేట్.. ప్రకటించిన యూపీ సీఎం యోగి

**టాకీస్:** మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ సినిమాను మొదటగా ఏప్రిల్ 25న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అనుకొన్ని కారణాల వలన ఈ సినిమా వాయిదా పడింది. అయితే తాజాగా ఈ మూవీ విడుదల తేదీని మళ్లీ ప్రకటించారు మేకర్స్. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను బుధవారం కలిసిన కన్నప్ప టీం.. యోగి చేతుల మీదుగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ మూవీని జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సీఎం యోగి మూవీ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్టీఆర్,ప్రశాంత్ నీల్ కాంబో
### 22 నుంచి షూటింగ్‌లోకి ఎన్టీఆర్




**టాకీస్:** టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ర ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నాడని అభిమానులు ఎదురుచూస్తుండగా.. వారికి గుడ్ న్యూస్ చెబుతూ.. ఈ నెల 22 నుంచి తారక్ ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ క్రేజీ అప్‌డేట్‌తో ఎన్టీఆర్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు.

## నా కూతురు కూడా నాలాగే పెరగాలి: ఉపాసన

**టాకీస్:** రామ్ చరణ్ అర్ధాంగి ఉపాసన కొణిదెల ఒకవైపు గృహిణిగా, మరోవైపు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) వైస్ చైర్‌పర్సన్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో కుటుంబానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"మా అమ్మ నాకు బెస్ట్ ఫ్రెండ్" అని ఆమె అన్నారు. తాను తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద పెరిగానని, వారి చేతుల్లో పెరగడం ఒక అందమైన అనుభవం అని అన్నారు. కానీ ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మాత్రం అత్తమామలతో కలిసి ఉండటమే ఇష్టమని తెలిపారు. తన కుమార్తె కూడా తనలాగే నానమ్మ, తాతయ్యల దగ్గర పెరగాలని కోరుకుంటున్నానని అన్నారు. అప్పుడే తన కుమార్తె వారి వద్ద నుంచి కూడా ఎంతో కొంత నేర్చుకుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన అత్త, మామయ్యలు తనను జాగ్రత్తగా చూసుకుంటున్నారని తెలిపారు. తాను ఇంట్లో లేని సమయంలో తన కుమార్తె మంచి వ్యక్తుల చేతుల్లో ఉ ందనే ధీమా ఉంటుందని చెప్పారు. తన తల్లిదండ్రులు కూడా మనవరాలి పట్ల అంతే ప్రేమను చూపిస్తారని అన్నారు. తమ కుటుంబ సభ్యులు అందరూ క్లీంకార ఎదుగుదలలో భాగమవుతున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.






## వరుస ఫెయిల్యూర్స్‌తో కావ్య థాపర్ సైలెంట్

టాకీస్: గత ఏడాది బాగా హడావుడి చేసిన బ్యూటీ కావ్య థాపర్ ఈ ఏడాది సైలెంట్ అయ్యింది. ఫ్లాప్స్ ఆమె కెరీర్ పై గట్టి దెబ్బే వేశాయి. స్టార్ హీరోలతో జోడీ కట్టినప్పటికీ ఇప్పుడు ఛాన్సుల కోసం వెయిట్ చేస్తోంది. ఈ మాయ ప్రేమేమిటోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కావ్య బేబీ ఈ ఏడేళ్లలో పది సినిమాలు కూడా చేయలేక పోయింది. కోలీవుడ్, బాలీవుడ్ లోకి స్టెప్ ఇన్ అయినా పెద్దగా కలిసి వచ్చిందీ ఏమీ లేదు. ఏక్ మిని కథ, పిచ్చైకారన్ చిత్రాల్లో మంచి ఫెర్పామెన్స్ చూపించడంతో టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించే ఛాన్సులు కొల్లగొట్టింది కావ్య. అప్పటి వరకు ఏడాదికి ఒక్క మూవీ చేసుకుంటూ వచ్చిన భామ లాస్ట్ ఇయర్ నాలుగు సినిమాలతో పలకరించింది. రవితేజ ఈగల్, సందీప్ కిషన్ ఊరు పేరు భైరవకోన, రామ్ డబుల్ ఇస్మార్ట్, గోపీచంద్ విశ్వమ్‌లో గ్లామరస్ రోల్‌లో కనిపించింది కానీ ఊరు పేరు భైరవ కోన మినహా మిగిలివన్నీ డిజాస్టర్లు. ఈ హ్యాట్రిక్ ఫ్లాప్స్ ఆమె కెరీర్‌పై గట్టి దెబ్బేశాయి. పేలవమైన స్క్రిప్ట్స్ కావ్యను ఫేడవుటుకు దగ్గర చేశాయి. విశ్వం తర్వాత కాస్త గ్యాప్ తీసుకునేందుకు వెకేషన్స్‌కు వెళ్లిన కావ్య థాపర్ మళ్లీ కెరియర్ పై ఫోకస్ చేస్తోంది. ఓ సినిమాకు కమి-టైనట్లు- టాక్. ధమాకా దర్శకుడు త్రినాథ రావు నక్కిన అప్ కమింగ్ ప్రాజెక్టులో ఓకే అయినట్లు టీఎఫ్ఐలో బజ్ నడుస్తోంది. హవీష్ హీరోగా తెరకెక్కుతోన్న ఈసినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లినట్లు సమాచారం.




## అవును..నేను ఒంటరినే: తమన్నా

టాకీస్: అవును...నేను ఒంటరినే అంటూ తమన్నా భాటియా సమాధానం ఇచ్చారు. తమన్నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. ఆమె కొన్నేళ్లుగా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ విడిపోయినట్లు కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయని, అందుకే బ్రేకప్ చెప్పేసుకున్నారని తెలుస్తోంది. అయితే, బ్రేకప్ వార్తలపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు. 'ఓదెల 2'ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా పాల్గొంటున్న నటి తమన్నా తాజాగా జరిగిన ట్రైలర్ విడుదల ప్రచార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. నటుడు విజయ్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒక విలేకరి తమన్నాను ప్రశ్నించారు.దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. విజయ్ అనే పేరు ఎక్కడా రాకుండా ఆమె బదులిచ్చారు. కార్యక్రమంలో తమన్నాతోపాటు- ఇతర చిత్రబృందం పాల్గొంది.

ఇందులోభాగంగా ఓ విలేకరి.. మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమిదనైనా విజయం సాధించాలను కుంటున్నారా అని ప్రశ్నించింది. దీనిపై తమన్నా స్పందిస్తూ.. 'మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నేను నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీపై ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. నేను ఏం చెబితే అదే రాసుకుంటారని ఆమె సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విజయ్ పేరు ప్రస్తావించ డానికి కూడా తమన్నా ఇష్టం చూపించడం లేదని మాట్లాడుకుంటున్నారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. 'జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలను కుంటాం. అవిధంగా వారి నుంచి మనం సపోర్ట్ పొందుతాం. కానీ, ఆధ్యాత్మిక ప్రయాణంలో నేను ఒక విషయాన్ని నేర్చుకున్నా. ఆనందం లేదా బాధ మన చేతుల్లోనే ఉండాలి. ప్రశ్న ఏదైనా లోతుగా ఆలోచిస్తే సమాధానం కూడా దొరుకుతుందని ఆమె చెప్పారు. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్'కు కొనసాగింపుగా 'ఓదెల 2' సిద్ధమైంది. ఇందులో తమన్నా శివశక్తిగా కనిపించనున్నారు. అశోక్ తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదల కానుంది.

## ఆస్తుల విషయంలో అదంతా పుకారే: రాజీవ్ కనకాల

**టాకీస్:** నటుడిగా, నిర్మాతగా రాజీవ్ కనకాల కొన్ని ప్రాజెక్టులు చేస్తూ వెళుతున్నాడు. రీసెంటుగా ఆయన చేసిన 'హోమ్ టౌన్' సిరీస్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఆయన 'బిగ్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన గురించిన అనేక విషయాలను ప్రస్తావించాడు. "1988లో అనుకుంటాను... మా ఫాదర్ 40 లక్షలను వడ్డీకి తెచ్చి మరీ ఒక ప్రాపర్టీ కొన్నారు. ఆ విషయంలో అవతలవారు ఆయనను మోసం చేశారు. ఫలితంగా అప్పులు, వడ్డీలు మాత్రమే మిగిలాయి" అని అన్నాడు.



"ఆ రోజులలోనే నెలకి 30 వేల నుంచి 40 వేలు వడ్డీలు కట్టవలసి వచ్చేది. ఈ కారణంగా ఇంట్లో గొడవలు అవుతూ ఉండేవి. ఆ సమయంలో నాన్నగారు ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నారట. ఆ విషయం అమ్మ చెబితే... మా నాన్నకు నేనే ధైర్యం చెప్పాను. ఎనో కష్టాలు పడుతూ ఆ అప్పు తీర్చాము. ఇక నేను, సుమ విడాకులు తీసుకుంటున్నట్టుగా వార్తలు వచ్చాయి. కొన్ని కారణాల వలన నేను మా నాన్నతో కలిసి పాత ఇంట్లో ఉన్నాను. ఆ సమయంలో ఇలాంటి పుకార్లు సృష్టించారు" అని చెప్పాడు.

"ఇక మీరంతా అనుకుంటున్న స్థాయిలో మాకు ఆస్తులు లేవు... ఉన్నది ఒకటే ఇల్లు. కొంతమంది తమ వెంచర్లో ప్లాట్లు అమ్ముకోవడం కోసం, సుమ-రాజీవ్ కనకాల వాళ్లు తీసుకున్నారని కస్టమర్లతో చెబుతున్నారట. దాంతో మాకు చాలా చోట్ల ల్యాండ్స్ ఉన్నాయని అనుకుంటున్నారు. నిజానికి అదంతా ప్రచారం మాత్రమే" అని స్పష్టం చేశాడు.

## ఆసుపత్రిలో కోలుకుంటున్న మార్క్ శంకర్..

**టాకీస్:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని



ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఫొటోను విడుదల చేశారు కుటుంబసభ్యులు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు మార్క్ పూర్తిగా కోలుకోవడానికి మూడు రోజులు పట్టనున్నట్లు సమాచారం.



## అల్లు అర్జున్, అట్లీ సినిమాకి కొత్త మ్యూజిక్ డైరెక్టర్!

**టాకీస్:** అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకుడిగా సాయి అభ్యంకర్ ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అధికారికంగా ఇంత వరకు ప్రకటన విడుదల కానప్పటికీ దాదాపు ఖరారైనట్లు వార్తలు వినిపిస్తున్నా యి. 20 ఏళ్ల సాయి అభ్యంకర్ ఇప్పటి వరకు సంగీత దర్శకుడిగా ఒక్క సినిమా కూడా చేయలేదు. కానీ కొన్ని ప్రైవేటు సాం గ్స్ చేశాడు. అవన్నీ కూడా చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయి. ఇప్పటి వరకు రాక్ స్టార్ అనిరు ధ్ వద్ద అడిషనల్ ప్రోగ్రామర్‌గా సాయి అభ్యంకర్ పనిచేశాడు. దేవత, కూలీ లాంటి సినిమాలకు అడిషనల్ ప్రోగ్రామర్‌గా వ్యవ హరించాడు. అయితే ఇప్పుడు ఏకంగా అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతు న్న సినిమాకి సంగీత దర్శకుడిగా ఎంపిక య్యాడనే వార్తలు రావడంతో, ఎలాంటి నేపథ్యంతో ఈ అవకాశం దక్కించుకున్నా డని చాలా మంది సందేహాలు వ్యక్తం చేస్తు న్నారు. సాయి అభ్యంకర్ సంగీత కుటుం బం నుంచే వచ్చాడు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ప్లే బ్యాక్ సింగర్లుగా సంగీత ప్రపంచాన్ని ఏలిన టిప్పు, హరిణి దంపతుల కుమారుడే సాయి అభ్యంకర్. సంగీతంపై ఆసక్తితో అనిరుధ్ వద్ద పనిచేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.